# సింగిల్ పేజీ కథలు

## ట్యూమర్

**డాక్టర్ స్రవంతి చైల్డ్ స్పెషలిస్ట్. ఏడుపు తప్ప తమ బాధని వ్యక్తపరచడానికి మరో మార్గం తెలియని, తన దగ్గరకొచ్చే పసివాళ్ల ఏడుపు క్షణంలో మాన్పించి, నవ్వులు చిందించే 'మంత్రం' ఏదైనా ఆమె మాటల్లో ఉందేమో అనిపిస్తుంది.**

ప్రశాంతి నర్సింగ్‌హోంలో ఉదయమే అడ్మిట్టయ్యాడు నాల్గేళ్ల రోహిత్. ఆసుపత్రికొచ్చింది మొదలు ఆపకుండా ఒకటే ఏడుపు. 'ఇంటికెళ్లిపోదాం' అని హఠం పట్టి ఏడుస్తున్న రోహిత్‌ని ఏడుపు ఆపు చేయించడం తాత రామ్మూర్తికి చేతగావటం లేదు. వార్డు రౌండ్స్‌లో రోహిత్ ఉన్న రూంకొచ్చింది స్రవంతి.

డాక్టర్ని చూసిన రోహిత్ ఏడుపు సౌండు పెంచేసరికి రూమంతా రీసౌండ్ రాసాగింది. ఏప్రాన్ జేబులో ఉన్న చాక్లెట్ తీసి వాడి చేతిలోపెట్టి, వాడితో రెండు మాటలు మాట్లాడేసరికి మంత్రం వేసిన వాడిలా ఏడుపు మానేశాడు. వాణ్ని మాటల్లో పెట్టి చెకప్ కంప్లీట్ చేసింది స్రవంతి.

ఆశ్చర్యంగా స్రవంతిని చూస్తూ "డాక్టర్! వీడు నా మనవడు. వీళ్లమ్మా నాన్నా ఇద్దరూ డాక్టర్లే. వీళ్లమ్మ యు.ఎస్. వెళ్లింది. నా కొడుకు డాక్టర్ కిషోర్ కార్డియాలజిస్టు. చెన్నయ్‌లో పని జేస్తాడు" అన్నాడు రామ్మూర్తి.

"అలాగా!" అని చిర్నవ్వు నవ్వింది.

"రోహిత్‌కి రెండ్రోజులుగా ఫిట్సొచ్చినట్టు కింద పడిపోతున్నాడు." అని చెప్పాడు.

రోహిత్‌కి కొన్ని టెస్టులు చేయించింది స్రవంతి. రిపోర్టన్నీ పరిశీలించి, ఆ రోజు సాయంత్రం రూమ్‌కొచ్చి... "చూడండి మూర్తిగారూ! రోహిత్‌కి మెదడు కింది భాగంలో చిన్న కణితి ఉంది. 'బ్రెయిన్ ట్యూమర్' అంటారు. దానివల్లే ఫిట్స్ వస్తుండొచ్చు. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి" అంది.

స్రవంతి మాటలకి భయాన్నంతా మొహంలో కనబరుస్తూ "ఏం భయం లేదు గదమ్మా" అన్నాడు.

"భయపడకండి... నమ్మకం ముఖ్యం. రోహిత్ విల్ బి ఆల్‌రైట్" అని స్రవంతి చెప్పేసరికి..

"భయపడి మాత్రం ఏం చెయ్యగలనమ్మా! నా కొడుక్కి ఫోన్ చేసి రప్పిస్తా!" అన్నాడాయన.

* * *



మధ్యాహ్నం ఒంటి గంటైంది. స్రవంతి లంచ్‌కి వెళ్లబోతోంది.

రామ్మూర్తితో పాటు లోపలికొచ్చిన కిషోర్ని చూసి షాకయిన స్రవంతి స్థాణువులా మారిపోయింది. తనవైపే చూస్తున్న రామ్మూర్తిని గమనించి, క్షణంలో తేరుకుని చిర్నవ్వుతో-

"రండి కూచోండి" అంది.

"ఐయాం సారీ! స్రవంతీ! మళ్లీ ఇన్నేళ్లకి నిన్నిలా! సర్‌ప్రైజింగ్..." అన్నాడు కిషోర్.

మౌనంగా అతనెదురుగా కూచున్న స్రవంతి మనస్సు క్షణకాలం చదివేసిన పేజీల్ని తిరగేసింది.

మెడికల్ కాలేజీలో ఉండగా తన అందం, రూపం, వాక్చాతుర్యంతో కిషోర్ స్రవంతి హృదయంలో చిన్న కదలిక కలిగించి, దాన్ని ఫైనలియర్ వరకూ కొనసాగించి, ఆ తర్వాత రొటీన్ సినిమా డైలాగులు అప్పజెప్పి మాయం అయ్యాడు. మళ్లీ అయిదేళ్ల తర్వాత ఇప్పుడు....

"స్రవంతీ! ఐయాం సారీ! అప్పుడు నేనున్న పరిస్థితుల్లో..." అనేదో కిషోర్ చెప్పబోతుంటే అడ్డుపడి..

"ప్లీజ్! స్టాపిట్. ప్రేమ విషయంలో ఒక్కసారి నిర్ణయం తీసుకున్నాక, మంచో, చెడో, ఇచ్చిన మాటకి కట్టుబడుండటం మగాడి లక్షణం. కానీ నువ్వూ... నన్ను ప్రేమించి... సారీ నటించి, ప్రశాంతంగా ఉన్న నా మనస్సులో ప్రణయపు ప్రళయాన్ని సృష్టించి, చివరకి... నాతో చెప్పకుండా... పిరికివాడిలా పారిపోయావు. ఏమయ్యావో తెలియక మన ప్రేమ గుర్తుగా నువ్వు నాకిచ్చిన ఈ గొలుసుని ఇంకా దాచుకున్న దీన్ని, మోస్తున్న నా హృదయానికి ఏర్పడ్డ ట్యూమర్‌ని ఏం చేయాలి" అని వేగంగా మెడలో చెయిన్ తీసి కిషోర్ మొహం మీద విసిరేసింది స్రవంతి.

కిషోర్ ఏదో చెప్పబోతుంటే, చెయ్యి చూపిస్తూ "గెట్ అవుట్" అంది ఆవేశంగా.

అవాక్కయి చూస్తున్న రామ్మూర్తికి విషయం అర్థమయి నోరు మెదిపే లోపు, కిషోర్ లేచి వేగంగా బయటికెళ్లాడు.

అప్పటిదాకా ఆవేశంతో ఎర్రబడ్డ మొహానికి, క్షణంలో చిర్నవ్వు సృష్టించుకుని, లేచి నుంచుని.. రామ్మూర్తి వైపు తిరిగింది.

"చూడండి! ఇది నా పర్సనల్ విషయం. నా ప్రొఫెషన్‌కి ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డురాదు. రేపు ఉదయం మీ రోహిత్‌కి సర్జరీ. ధైర్యంగా ఉండండి" అని బైటికి వెళ్తున్న డాక్టర్ స్రవంతి వైపు ఖిన్నుడై చూస్తూ నిలబడ్డాడు రామ్మూర్తి.

**-ఎం.వెంకటేశ్వరరావు(సికిందరాబాద్)**